# కాఫ్కా తోలిన ఈగలు...

ఎమ్మెస్ సూర్యనారాయణ

**పనీపాటా లేని ఖాళీ సాయంత్రపు వేళ...మూలగది లోపలి చెక్కబీరువా తెరిచాను.**

**జుయ్‌మని రేగాయి ఈగలు!**

**ఎప్పటివో... ఇరవైఏళ్ళ నాటి ఈగలు... పాత స్క్రిప్టుపైన మూగి...అట్లాగే ఉండి పోయాయి కాబోలు! నా చేతి అలికిడికి ఒక్క సారిగా చెదిరి హారర్ సినిమా ఎఫెక్ట్‌లా నన్ను ముంచెత్తాయవి!**

హఠాత్తుగా నిలువెల్లా ముట్టడించిన పాడు ఈగలు ...చివరికి నా రికామీ బుర్రలోకి దూరాయి!

ఇరవైఏళ్ళ నాటి 'ఈగలకథ'...ఇలా తిరగబడుతుందని తెలీకపోయింది. అంతా ఒక భయంకర చిత్రం. అసంకల్పిత కల్పితం.

వాటి తప్పేమీలేదు.

ఈగలు...ఈగాత్మనే ఆవిష్కరించాయి!

పాత రాత ప్రతి మీద ఇప్పటిదాకా ఎన్ని ఈగ తరాలు గడిచాయో! నా చేతి అలికిడికి లేచి విజృంభించాయి! ఈగల తండా ఒక్కసారిగా నాపైన దాడి జరిపింది.

ఉక్కిరి బిక్కిరై ఒక్క ఉదుటున వరండాలోకి పరుగెత్తాను. బుర్రలోపలి ఈగల్ని విదిల్చికొట్టాను శక్తికొద్దీ.

అంగుళం కదల్లేదు ఈగలతండా!

'ఇంట్లో ఒంటరిని చేసి ఏమిటీ ఈగల మోతా'

అని వ్యాకుల పడ్డాను.

కారిడార్‌లో రిలాక్సింగ్ ఛైర్లో కూలబడ్డాను అలసటగా. ఈగల బెటాలియన్ బుర్రని ఆక్రమించేశాయి.

అందులోనూ రికామీ బుర్ర! వొదిలి పెడతాయా? ఈగల చొరబాటు పూర్తయ్యింది! వాటి కవ్వింపు చర్యలు...వాటి ఎదురు దాడులు...

ఈగల మోత వెర్రిగా చిర్రెత్తిస్తోంది. ఈ తండాని ఎలా తిప్పికొట్టాలి? ఆలోచనకి తావులేకుండా...

బుర్రని దురాక్రమించేయి! ఇటువంటి మహా విధ్వంస సమయంలో ఒక మేఘం నన్నాదుకుంది. గాఢమైన మబ్బుల తెరేదో ఆకాశాన్ని కమ్ముకుంది. ఉన్నట్టుండి ఉరిమింది ఆకాశం.

చూస్తూండగానే చకచకా చినుకులు...

ఖాళీ సాయంత్రాన్ని ముసురు పూర్తిచేసింది! ముసిర్న ఆ సాయంత్రపు వేళ-నా ముందు వర్షపు సెల్...!

చూరుమీంచి ఏకధారగా నీటిచువ్వలు భూమిలోకి చొచ్చుకుపోతున్నాయి.

చల్లటి గాలి తెరలేవో మృణ్మయంగా ఆపాద మస్తకాన్నీ తడిమి వెళ్ళాయి.

ఈగల తండా హఠాత్తుగా మాయమైంది!

ఒక ధారాపాతపు నీటిఊచల జైలులో...పొడుగాటి కారిడార్ చివర...రిలాక్సింగ్ ఛైర్లో అనీజీగా సెటిలయ్యి ఆలోచిస్తున్నాను. ఏం చెయ్యగలను ఈగల్ని?

ఇరవై ఏళ్ళ నాటి ఈగలకథ! రద్దీగా ఉండే వీధిలో ... ఆ ఇంటిముందు...ఆ సాయంత్రం... ఒక షామియానా! షామియానా కింద-

ఆరు ఐసుగడ్డలూ...వాటిపైన ఆరు శవాలూ...

శవాల పైన ఈగలూ! ఒకే ఇంటి శవాలు ఆరు... ఐసుగడ్డలు ఆరు... జనం తండోపతండాలు... ఈగల తండా సరేసరి! తండాని తోలేందుకు కొన్ని చేతులు!

తోలే కొద్దీ ముసిరే వెకిలి తండా! ఆ మామూలు సాయంత్రం...మామూలు సమయం... ఈగల మోతతో దద్దరిల్లిపోయింది! కానీ-హఠాత్తుగా కురిసిన వర్షంతో తండా మాయమైపోయింది!

ఎక్కడికి పోయింది పాడు ఈగల గుంపు?

ఎక్కడ నక్కిందీ? పాడెమీద పోగయిన పాడు ఈగల కూడిక... ఎలా తేలిపోయిందీ?

నీటి జైలు ఊచలు లెక్కబెడ్తూన్నాను. నేలను తాకుతున్న నీటి చిటపటల మృదంగ నాదం వింటో...

రిలాక్సింగ్ ఛైర్లో అసహనంగా కదుల్తో ఆలోచిస్తున్నాను. ఇరవైఏళ్ళ ఈగల కథ అలాగే ఉండిపోయింది!

ఏం చెయ్యగలను నేనొక్కణ్ణే?

ఇప్పటిదాకా హడలెత్తించిన తండా మళ్ళా దాడిచేస్తే నాకు దిక్కేదీ? ఎవరైనా వచ్చి రక్షించకూడదూ!

అవును... ఎవరైనా రాకూడదూ?ఎవరొస్తారూ? నా ఈ ఒంటరి కారిడార్‌లోకి? నా ప్రార్థన ఎవరాలకి



స్తారూ? నాలోపలి శవాలపైన ఇరవై ఏళ్ళుగా గుడ్లు పెడ్తున్న ఈగాత్మల్ని...నేనే చెదరగొట్టాను...రికామీగా!

పనీపాటాలేని తప్పిదానికి స్వయంకృతానికి ఎవరు జవాబుదారీ? అయినా- పునరుత్థానంలాంటి అద్భుతమేదో జరిగి మొత్తానికి ఇప్పుడెవరో రావాలి...

నా ఈగలు తోలాలి! ఈగ జన్మవృత్తాంతపు రహస్యం ఎరిగిన వారెవరో రోగ క్రిమి సిద్ధాంతపు తత్త్వం తెలిసిన వారెవరో రావాలి... అయినా ఎక్కడికి పోయుంటాయి ఈగలు? ఇక్కడ ముట్టడించిన పాడు ఈగలు...ఎక్కడ నక్కి ఉంటాయి?

వర్షపు నీటికొరడాలకు భయపడి పారిపోయిన ఈగల మూక ఏ రహస్య లోకాలకి చేరుంటుందీ?

ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ ఎవరో వస్తున్న అలికిడయ్యింది. చెవులు రిక్కించాను. నిజమే! ఎవరో వస్తున్న అడుగుల చప్పుడు... లీలగా... నా వైపే ఎవరో మహత్ముడు పునరుత్థానపు అడుగులతో వస్తున్నట్టుంది.

ఈగాత్మలు బెదిర్నట్టు... రోగక్రిములు మండినట్టు ... ఎవరా వచ్చేదీ?

వర్షపు జైలు ఊచల్ని వొంచుకుంటూ నా ఊరు చివరికి...

నా చూరు కిందికి... ఎవరో వస్తున్న చప్పుడు.

ఒక సుదీర్ఘ వాక్యపు చివరి చుక్క దగ్గర...

జీవితపు కారిడార్ అంచు దగ్గర....

రిలాక్సింగ్ ఛైర్లో అనీజీగా ఆలోచిస్తున్నాను.

నా లోపలి శవాల కింద నలిగిన జ్ఞాపకపు సమాధుల్లోంచి బయల్దేరాడతను!

సమాధి స్థితి నుంచి లేచిన శక్తిలా...

అవును... నిర్గుణంగానే... అతనొస్తున్నాడు!

దూరంగా... నీడలా... అతను...

నావైపే వొస్తున్నాడు!

అంత పనీ జరిగింది... అతనే వస్తున్నట్టున్నాడు... చీకటి కమ్ముకుంటున్న వర్షధారలో తడిసి ముద్దయి వస్తున్నాడతను.

ఎవరా వచ్చేదీ? ఒకవేళ... కాఫ్కా?!

అతన్ని నేనెరగను. 'నేనేమైనా' కొంచెంలో కొంచెం అణువులో అరవయ్యోవంతేమైనా

తనకి తెలుసేమో, నాకు తెలీదు!

యాదృచ్ఛికంగా... వర్షపు జైలు ఊచల్ని విరగదీస్తూ... ముద్దలా వచ్చాడు...

నీటి చువ్వల్ని పొడిచేస్తూ మేరునగధీరుడిలా నడిచొచ్చాడు. ముద్దముద్దగా... తడిసి మోపెడై వచ్చాడు.

తనని తాను పిండుకుంటూ నా చూరు కిందకి వచ్చి నిలబడ్డాడు.

మా ఇద్దరికీ మధ్యలో నీటి మువ్వల తెర!

వానజైలు ఊచల కటు కాఫ్కా... ఇటు నేనూ!

ఎంత విచిత్రం! నా చిర అపరిచిత పరిచితుడు

దయతో... ఒక ముగింపు వాక్యంలా...

ఒక సమాపనోత్సవంలా... నా సమీపానికొచ్చాడు.

వర్షపు నీటి చుక్కల సందులోంచి పాత రాతప్రతిని అతనికందిస్తూ అన్నాను-

'ఇదిగో... ఇరవైఏళ్ళ నాటి కథలోంచి రేగాయవి!'

ఇరవై ఏళ్ళ సాయంత్రం...ఇంటిముందు

షామియానా స్మశానంలో ఆరు ఐసుగడ్డలూ

వాటిపైన తెల్లటి దుప్పటీల్లో పేక్ చేసిన

ఆరు రక్తపు ముద్దలూ...

వాటిపైన ఈగల తండా!

హఠాత్తుగా ముసిర్న ఆ మామూలు సాయంత్రాన...శవాల మీంచి ఎగిరిపోయాయి!

హోరుమనే వర్షపాతంలో

ఒకే ఒక్క నేనూ-

షామియానా-

ఆరు ఐసుగడ్డలూ-

ఆరు శవాలూ-

ఒక శవ ఏకాంతం!

"ఇంతకీ... వర్షం తరిమిన ఈగలతండా ఏమై ఉంటుందీ? ఎక్కడ నక్కి ఉంటుందీ?" ఒక ధారాపాతపు నీటి జైలు కీవల నేనూ ఆవల అతనూ...

మధ్యలో ఒక ప్రార్థన

ఒక అభ్యర్థన- ఒక సమాధాన స్థితి

ఏమైయుంటాయి ఈగలు?

'మరో గాయం మీదో... మిఠాయి దుకాణంలోనో!'

వర్షపు సెల్ కుప్పకూలింది.

రహస్యంగా నక్కిన ఈగల తండా రేగింది.

కాఫ్కా దోవ చూపించాను తండాకి! ■